క్లుప్తంగా

ఆర్థికసాయం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న సురేశ్

కేశంపేట: మండల పరిధిలోని కోనాయపల్లి గ్రామ శివారులోని లచ్చానాయక్ తండాలో దాచ్యానాయక్ అకస్మాత్తుగా మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. ఈ ఆర్థిక సాయాన్ని ఆదివారం గ్రామ కాంగ్రెస్ నాయకులు గ్యార సురేశ్ మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తండా యువకులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

నందిగామ: మండల పరిధిలోని నర్సప్పగూడలో ఆదివారం మైసమ్మ దేవాలయ నిర్మాణానికి గ్రామస్తులు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ స్థలంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేవాలయ నిర్మాణానికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. మూడునెలల్లో నిర్మాణం పూర్తి చేయనున్నట్లు వారు తెలిపారు.

పద్మశాలిలు ఆర్థికంగా ఎదగాలి

సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు



నర్సింలుకు నియామకపత్రం అందజేస్తున్న సుధాకర్‌రావు

షాబాద్: పద్మశాలిలు ఆర్థికంగా ఎదగాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం నగరంలో మండల పరిధిలోని సర్దార్‌నగర్ మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింలును పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకొని నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీలు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎనికైన నర్సింలు మాట్లాడుతూ.. ఉపాధ్యక్షుడిగా తనను ఎనుకున్నందుకు జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పద్మశాలీలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు.

విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు



పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు

కొందుర్గు: మండల కేంద్రంలోని రాజేశ్‌పటేల్ మినీఫంక్షన్ హాలులో న్యూమాంక్స్ కుంగ్‌ఫూ అసోషియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు సంబంధించిన 30 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చాటారు. ప్రతిభ ఆధారంగా నిర్వాహకులు విద్యార్థులకు బెల్ట్‌లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో న్యూమాంక్స్ కుంగ్‌ఫూ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌పటేల్, కుంగ్‌ఫూ తెలంగాణ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రాము, జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రమేశ్, మహబూబ్‌నగర్ జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సత్యం, మాస్టర్లు నరేందర్, బాల్‌రాజ్, శ్రీకాంత్, గణేశ్ పాల్గొన్నారు.



తాళ్లపల్లిలో సిబ్బంది లేక మూతబడిన పశువైద్య ఉపకేంద్రం



పోతుగల్‌లో మూతబడిన పశువైద్య ఉపకేంద్రం

పశువైద్యం.. అందని దైన్యం

మండలంలో ఇద్దరే డాక్టర్లు

- సిబ్బంది కొరతతో సకాలంలో అందని వైద్యసేవలు
- ఆందోళనలో పాడి రైతులు

షాబాద్: మండలంలో మూగజీవాలకు పశువైద్యం అందనిద్రాక్షలా తయారైంది. పశు వైద్యశాలల్లో సిబ్బంది కొరతతో పాటు సరిపడా వసతులు లేక పశువులకు సరైన వైద్యం అందడంలేదు. షాబాద్, రేగడిదోస్వాడ వైద్య కేంద్రాలకు మాత్రమే డాక్టర్లు ఉన్నారు. పశువులకు, గొర్రెలకు రోగాలు వస్తే చికిత్స ఎలా చేయించాలో తెలియక గొర్రెల కాపరులు, పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో మొత్తం రెండు పశువైద్య కేంద్రాలు, ఆరు ఉపకేంద్రాలు ఉన్నాయి. మొత్తం 14,046 పశువులు ఉండగా, 67,146 గొర్రెలు, మేకలు ఉన్నాయి. అదేవిధంగా 15,112 కోళ్లు ఉన్నాయి. వీటన్నింటికీ పశువైద్య సిబ్బంది ఆరు నెలలకోసారి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాల్సి ఉంటుంది. అదేవిధంగా గొంతువాపు, జబ్బవాపు, పార్శురోగం, చిటుకవ్యాధులకు టీకాలను అందివ్వాల్సి ఉంటుంది. కానీ పశువైద్య శాలలు ఉన్నప్పటికీ కొంతకాలంగా పోస్టులు భర్తీకి నోచుకోకపోవడంతో మండలంలోని పశువులకు సరైన వైద్యం అందడంలేదు.

ఇద్దరు డాక్టర్లతోనే..

మండలంలోని షాబాద్ డాక్టర్ స్రవంతి, రేగడిదోస్వాడ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిలు ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా తాళ్లపల్లి, చందనవెల్లి, పోతుగల్, మాచన్‌పల్లి, బోడంపహాడ్, సర్దార్‌నగర్ పశువైద్య ఉపకేంద్రాల్లో సిబ్బంది కొరత ఉండటంతో ఆయా గ్రామాల్లోని పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నా.. లేనట్టేనని ఆయా గ్రామాల రైతులు, గొర్రెల కాపరులు ఆరోపిస్తున్నారు. డాక్టర్లు, సిబ్బంది లేక పశువైద్య కేంద్రాలు వెలవెలబోతున్నాయి. సిబ్బంది కొరతతో గ్రామాల్లో రైతులు తమ పశువులకు, గొర్రెలకు ఏదైనా జబ్బు చేస్తే ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి పశువైద్య సిబ్బందితో పాటు పది మంది పశువైద్య సహాయకులు, మరో పంది మంది సహాయకులు విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే చందనవెల్లి, సర్దార్‌నగర్‌లో మాత్రమే పశువైద్య సహాయకులు ఉన్నారు. విధులు నిర్వహిస్తున్నారు. తాళ్లపల్లి, మాచన్‌పల్లి, పోతుగల్, బోడంపహాడ్ గ్రామాల్లోని పశువైద్య ఉపకేంద్రాల్లో సిబ్బంది లేక మూతబడ్డాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పశువైద్య కేంద్రాల్లో సిబ్బందిని నియమించి పాడిపశువులు, గొర్రెలకు వైద్యసేవలు అందేలా చూడాలని పాడిరైతులు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి



పశువైద్య కేంద్రాల్లో నెలకొన్న సిబ్బంది కొరతను అధికారులు తీర్చాలి. మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. సిబ్బంది కొరతతో మూగజీవాలకు వైద్యం అందక పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– క్యామ నారాయణ, పాడి రైతు, కుమ్మరిగూడ

ఇబ్బంది పడుతున్నాం



గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి పశువైద్య కేంద్రాన్ని నిర్మించినా సిబ్బంది లేకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. సిబ్బంది లేకపోవడంతో ఉపకేంద్రం మూతబడటంతో పాటు పశువులు, గొర్రెలకు వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు సిబ్బందిని నియమించి సమస్య పరిష్కరించాలి.

– గంగిడి భూపాల్‌రెడ్డి, రైతు హైతాబాద్

కొరత వాస్తవమే..



మండలంలోని పశువైద్య సిబ్బంది కొరత ఉండటం వాస్తవమే. ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పశువైద్య సిబ్బంది లేని సబ్‌సెంటర్లలో పాడి రైతులు, గొర్రెల కాపరులు తమ సమస్యలు తెలియజేస్తే సిబ్బందిని అక్కడకు పంపించి పశువులు, గొర్రెలకు వైద్యసేవలు అందిస్తాం.

–చంద్రశేఖర్‌రెడ్డి, రేగడిదోస్వాడ పశువైద్యాధికారి

అన్నదానం.. మహాదానం

బీఆర్‌ఎస్ యువ నాయకుడు మురళీకృష్ణయాదవ్



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మురళీకృష్ణయాదవ్

షాద్‌నగర్‌రూరల్: ఆకలితో ఉన్న వారికి చేసే అన్నదానం మహా దానమని బీఆర్‌ఎస్ యువ నాయకుడు మురళీకృష్ణయాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో గల బస్టాప్ వద్ద కౌన్సిలర్ బచ్చలి నర్సింలు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మురళీకృష్ణయాదవ్ హాజరై మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్‌తో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇతరులకు సేవ చేసినప్పుడే నిజమైన సంతృప్తి లభిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టిన బచ్చలి నర్సింలును ఆయన అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్.నటరాజ్, నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



బొడ్రాయికి పూజలు చేస్తున్న పోతురాజులు

కురుమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాదయ్య

షాబాద్: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని కురుమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూద యాదయ్య, మాజీ సర్పంచ్ ర్యాకల శేఖర్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లన్న దేవాలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం శివసత్తుల పూనకాలు, పోతురాజుల నృత్యాలు, మల్లన్న నామస్మరణతో మల్లన్న బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున బోనాల ఊరేగింపుతో ఆలయానికి తరలివచ్చి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి బారులు తీరి పూజలు చేశారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామస్తులు ఆంజనేయులు, నర్సింలు, కుమార్, రాజుగౌడ్, శంకర్, శివ, శేఖర్, అనిల్ తదితరులు ఉన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న దోనూరి గోపాల్

షాబాద్: అందరి సహకారంతో దేవాలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని మల్లన్న దేవాలయ కమిటీ సభ్యులు దోనూరి గోపాల్, పొన్న సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ మల్లికార్జునస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న మల్లికార్జునస్వామి దేవాలయానికి తమ వంతు ఆర్థికసాయంగా అదే గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి దోనూరి గోపాల్ రూ.31లక్షల రూపాయల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గ్రామస్తులు ఆయనను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. పురాతన దేవాలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సులోచన శేఖర్‌రెడ్డి, బోకుల లింగం, అంనతరెడ్డి, లక్ష్మయ్య, ఆలయ కమిటీ నిర్వాహకులు దోనూరి విఠలయ్య, శంకరయ్య, వెంకట్‌రెడ్డి, సాయిరెడ్డి, ముత్యాల్‌రెడ్డి, హన్మంతు, కరుణాకర్, అశోక్, గోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి, యాదయ్య, వేమారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

సింహగర్జనను విజయవంతం చేయండి

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోకన్వీనర్ నర్సిమయ్య

షాద్‌నగర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా హైద్రాబాద్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ నర్సిమయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్‌హాలులో మాల మహానాడు ఆధ్వర్యంలో 'హలో మాల–ఛలో హైద్రాబాద్' కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ నర్సిమయ్య హాజరై కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ వారసులుగా రాజ్యాంగ హక్కులను కాపాడుకుందామన్నారు. మాలల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు చేపట్టనున్న ఉద్యమంలో ప్రతి మాల భాగస్వాములు కావాలని సూచించారు. మాలలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న హైద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మధ్యాహ్నం 12 గంటలకు భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, సభకు మాల మేథావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువకులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు గోపాల్, యాదగిరి, కేశవులు, మహేశ్, డాక్టర్ బుచ్చిబాబు, అర్జున్‌కుమార్, భీష్మరామకృష్ణ, నర్సింలు, రామకృష్ణ, రాంచందర్, మహేందర్, కృష్ణ, వేణుగోపాల్, రఘురాం, కుమార్, డాక్టర్ బాలు, శేఖర్, నరేష్, అశోక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాలల సింహగర్జన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సర్వేకు విపక్షాలు సహకరించాలి

తుక్కుగూడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ ప్రక్షాళనకు రాష్ట్రంలోని వివిధ పార్టీల నాయకులు సహకరించాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశంలో నమామీ గంగే మిషన్‌తో గంగానదిలో మురికి క్లీన్ చేస్తున్న బీజేపీ, తెలంగాణలో మాత్రం మూసీ పునర్జీవాన్ని వ్యతిరేకించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మూసీని పక్షాళన చేసి, గంగానది నీరు తీసుకొస్తే నల్గొండ జిల్లా వరకు తాగునీరు, వాతవరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో నివసించే ప్రజలకు మరొక ప్రదేశంలో నివాస వసతి కల్పిస్తామన్నారు.

ముమ్మరంగా సమగ్ర సర్వే



షాద్‌నగర్‌రూరల్: సర్వే పత్రాలను అధికారులకు అందజేస్తున్న ఎండీ.ఇబ్రహీం

- ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు
- సర్వేను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్లు, ఎంపీడీఓలు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేతో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండీ.ఇబ్రహీం అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్‌లో చేపట్టిన కులగణణ సర్వేలో భాగంగా ఎండీ.ఇబ్రహీం కుటుంబ వివరాల సర్వే పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులాల ఆధారంగా రిజర్వేషన్లను కల్పించడంతో పాటుగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేసేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో కుల గణనపై స్పష్టమైన ప్రకటన చేశారని గుర్తు చేశారు. కులగణన సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

చేవెళ్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి సర్వే వివరాలను అడిగి నమోదు చేసుకున్నారు. ప్రజలు ఎన్యుమరేటర్లకు సహకారం అందిస్తున్న అక్కడక్కడ కొంతమంది తమవివరాలు చెప్పేందుకు నిరాకరిస్తున్నట్లు చెబుతున్నారు. సర్వేను సూపర్‌వైజర్లు తనిఖీ చేస్తున్నారు.

సర్వే దేశానికే ఆదర్శం

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులాల సర్వే దేశానికే ఆదర్శమని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను విశాల ఆదివారం పరిశీలించారు. అనంతరం తమ కుటుంబ వివరాలను ఎన్యుమరేటర్లకు అందించిన అనంతరం మాట్లాడుతూ.. సర్వేలో రాష్ట్రానికి చెందిన ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఎన్యుమరేటర్లకు సహకరించాలని ఆమె కోరారు.



చేవెళ్ల: సర్వే నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీధర్



ఎన్యుమరేటర్‌కు వివరాలను అందిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల

గ్రూప్–3 పరీక్షలు ప్రశాంతం



ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలిస్తున్న అధికారులు



మొయినాబాద్: ఛాలెంజర్ స్కూల్‌లో పరీక్ష కేంద్రం లోపలికి వెళ్తున్న అభ్యర్థులు

షాద్‌నగర్: టీజీపీఎస్సీ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్–3 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఠాగూర్ ఉన్నత పాఠశాల, విజేత కళాశాల, బ్రిలియంట్ స్కూల్, శ్రీచైతన్య, విశ్వభారతీ కళాశాల, భాష్యం పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఆర్డీఓ సరిత నేతృత్వంలో తహసీల్దార్ పార్థసారధి రెవెన్యూ సిబ్బంది పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

హాజరు అంతంతే..

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్–3 పరీక్షలు మండలంలో ప్రశాంతంగా జరిగాయని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని జోగిన్‌పల్లి బీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, జేబీఐటీ ఇంజినీరింగ్ కళాశాల, చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ, కేఎల్‌హెచ్ డీమ్డ్ టూబీ యూనివర్సిటీ, ఎన్‌టీఆర్ మోడల్ స్కూల్ విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలల్లో గ్రూప్–3 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని గౌతమ్‌కుమార్ పేర్కొన్నారు. విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో 912 గాను 248 హాజరుకాగా, ఎన్‌టీఆర్ మోడల్ స్కూల్‌లో 528 మందికిగాను 139 మంది, కేఎల్‌హెచ్ డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో 720 మందికిగాను 108 మంది, చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో 600 మందికిగాను 171 మంది హాజరుకాగా, జేబీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో 312 మందికిగాను 70 మంది హాజరుకాగా, జోగిన్‌పల్లి బీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 816 మందికి 196 మంది పరీక్షలకు హాజరైనట్లు పేర్కొన్నారు. ఈ పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసి ప్రశాంతంగా నిర్వహించామని తెలిపారు.



మొయినాబాద్‌రూరల్: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్